# పోలీసూ ... లోపలికిరా ...

"రెండు రెళ్ళు .... నాలుగు .... మూడు రెళ్ళు ఆరు .... నాలుగు రెళ్ళు ఎనిమిది...." అంటూ పిల్లలు గట్టిగా ఎక్కాలు వల్లె వేస్తున్నారు. నలభై మంది చిన్న చిన్న పిల్లలు, మూకుమ్మడిగా ఒక్క గొంతుతో రాగయుక్తంగా అరుస్తుంటే ఆ స్కూలు మేడమీద ఉన్నా, ఆ సందు సందంతా దద్దరిల్లి పోతుంది.

అంతలో 'గొల్లు' మంటూ సందుకి అవతల ఉన్న మెయిన్‌రోడ్డు మీదనుంచి గోల వినిపించింది. ఆ గోలలో స్కూల్లో పిల్లలు ఎక్కాల శబ్దం వినిపించకుండా పోయింది.

మరు నిమిషంలో "బంద్‌కరో, బంద్‌కరో" అంటూ కేకలు వేసుకుంటూ అరవై, డెబ్బై మంది చిన్న చిన్న పిల్లలు రోడ్డుమీద నుంచి ఆ సందులోకి పరుగెత్తుకుంటూ వచ్చారు.

మేడమీద బళ్ళో పిల్లల ఎక్కాలు చదవడం ఆగిపోయింది. బయట గోలకి స్కూలు హెడ్మాస్టరు టీచర్లు బాల్కనీలోకి వచ్చారు. వారి వెనకాలే పిల్లలు కూడా బయటికి వచ్చారు.

మరుక్షణంలో పిల్లల గుంపు బడి ముందుకు పరుగు పరుగున వచ్చింది. "బంద్‌కరో" అన్న కేకలు మిన్నుముట్టాయి. రెప్పపాటు కాలంలో టప టపా రాళ్ళవర్షం బడిమీద కురియడం మొదలుపెట్టింది. కంకరరాళ్ళు తుపాకి గుళ్ళల్లే దూసుకువచ్చి, స్కూల్ గోడలకి గ్రుద్దుకోవడం మొదలు పెట్టాయి. అయితే స్కూల్ మేడమీద ఉండడంతో వాటిలో ఎక్కువభాగం క్రిందనే పడుతూ వచ్చాయి.

ఎప్పుడైతే పిల్లలు రాళ్ళు వేయడం మొదలుపెట్టారో స్కూలు బాల్కనీలోని పిల్లలు, కంగారుగా, ఒకరునొకరు త్రోసుకుంటూ, త్రొక్కుకుంటూ, లోనికి పరుగెత్తడం మొదలు పెట్టారు. హెడ్మాస్టరు, టీచర్లు కూడా హడావుడిగా పిల్లలను లోనికి పంపించడం మొదలు పెట్టారు.

ఇంతలో ఒక రాయివచ్చి బడిపిల్లలలో ఒక కుర్రవాడి నెత్తికి తగిలి, బడబడా నెత్తురు కారడం మొదలు పెట్టింది. "అమ్మోయ్ .... నాన్నోయ్" అంటూ ఆ పిల్లవాడు ఏడుపు మొదలు పెట్టాడు. ఆ దృశ్యం చూసి, భయంతో కొందరు పిల్లలు, ఏడుపులు మొదలు పెట్టారు.

బయట - పిల్లలగోల - రాళ్ళవర్షం.

లోపల - పిల్లల ఏడుపు, భయం - టీచర్ల తొట్రుపాటు......

వీటన్నిటితో ఆ స్కూల్ ప్రాంగణం రణరంగంగా మారిపోయింది.

హెడ్మాస్టరు ఒక్క ఉదుటన ఆ కుర్రవాడి దగ్గరికి వెళ్ళి,జేబులోంచి రుమాలు తీసి వాడి గాయానికి నొక్కి "చన్నీళ్ళు తీసుకురండి" అని గట్టిగా అరచి, వాడిని తీసుకొని చకా చకా లోనికి వెళ్ళాడు.

ఎవరో గ్లాసులో చన్నీళ్ళు తెచ్చారు. రుమాలును అందులోముంచి, ఆ గాయంమీద అదిమిపెట్టి

ఉంచాడు. బయట పిల్లల గుంపుని ఏమీ చేసేది లేక, అటువంక కోపంగా చూస్తూ, అసహ్యంగా పళ్ళు పటపటా కొరికాడు హెడ్మాస్టరు.

ఈలోగా మిగిలిన టీచర్లు, మిగతా పిల్లలను త్వరత్వరగా లోపలికి జేర్చేసి, తలుపులు మూసేసి ఉంచారు. లోపల పిల్లలు కంగారు పడకుండా వాళ్ళకి ధైర్యం చెప్పసాగారు.

దూరాన్నుంచి పోలీసుల ఈల వినిపించింది. అది వినిపించగానే బయట పిల్లలు "హోయ్' ' అంటూ కుకలువేస్తూ కాలికొద్దీ పరుగు పుచ్చుకున్నారు. పోలీసు వ్యాన్, పిల్లలు వెళ్ళినవైపే వాళ్ళని తరుముకుంటూ వెళ్ళింది.

నిముషంలో, ఆ ప్రదేశంలో తిరిగి ప్రశాంతత అలముకొంది పిల్లల మూక వస్తుంటే, కంగారుపడి తలుపులు మూసుకున్న దుకాణదారులు, తిరిగి ఓరగా తలుపు తెరచి, తలలు బయటకు పెట్టి అటూ యిటూ చూచి, వాళ్ళు వెళ్ళిపోయారని నిర్ధారణ చేసుకున్నాక తలుపులు పూర్తిగా తెరవడం మొదలు పెట్టారు.

స్కూలు తలుపులు మళ్ళీ తెరుచుకున్నాయి. హెడ్మాస్టరు స్కూలుకి సెలవు యిచ్చేసి, పిల్లలను ఇంటికి పంపించేశాడు. గాయం తగిలిన కుర్రవాడికి ప్రథమ చికిత్స చేసి, స్కూల్ ప్యూన్‌ని వెంట యిచ్చి, యింటికి పంపించి వేశాడు. ఆ తర్వాత తాను స్వయంగా పోలీసు స్టేషన్‌కు వెళ్ళి, జరిగిన దానిని గూర్చి రిపోర్టు యిచ్చి, తన స్కూల్‌కి పోలీసు రక్షణ యియ్యవలసిందిగా కోరుతూ దరఖాస్తు యిచ్చి వచ్చాడు.

## 2

మర్నాడు మళ్ళీ పిల్లల మూక "బంద్ కరో" అంటూ అరచుకుంటూ బయలుదేరింది. బడి అల్లంత దూరంలో కనిపించగానే పిల్లలు 'హోయ్' మంటూ మళ్ళీ పరుగు మొదలుపెట్టారు స్కూలువైపు. పరుగెత్తుకు వస్తున్న తమని చూసి దుకాణదారులు కంగారుపడి తలుపులు మూసుకుంటుంటే, వాళ్ళకి ఎంతో గర్వంగానూ, ఆనందంగాను వుంది. వాళ్ళలో ప్రతివాడూ తనని తాను ఒక జేమ్స్‌బాండ్ హీరోగా భావించుకోసాగాడు.

స్కూల్ సమీపించగానే పిల్లల 'బంద్ కరో' నినాదాలు మిన్నుముట్టాయి. ప్రతి కుర్రవాడు జేబులోంచి కంకరరాళ్ళు తీశాడు. "బంద్ కరో" అంటూ స్కూలుమీద రాళ్ళు విసరడం మొదలు పెట్టారు.

పిల్లలగోల దూరంనించే విని వాళ్ళు వచ్చే లోపలే పిల్లల్ని లోపలే ఉంచేసి, స్కూలు తలుపులన్నీ మూయించేశారు హెడ్మాస్టరు. కాని స్కూల్లోపల పిల్లలు ఉన్న విషయం ముందుగానే పసికట్టిన పిల్లలు అక్కడికి రాగానే రాళ్ళు వేయడం మొదలుపెట్టారు.

"కౌన్ హై?" అంటూ చేతిలో లాటి ఒకటి పుచ్చుకొని స్కూల్ గేట్లోనుంచి, బయటకు వచ్చాడు ఒక వయసు ముదిరిన పోలీసు.

ఎప్పుడైతే ఎర్రటోపీతో, చేతిలో లాటీతో పోలీసు కనిపించాడో, బయట ఉన్న పిల్లలందరికి పై ప్రాణాలు పైనే పోయాయి. అంతవరకు విజయుని వలె ముందుకు సాగుతూ వచ్చిన ఆ పిల్లలంతా ఉత్తర కుమారులవలె వెనక్కి తిరిగి పోసాగారు. ఈ దృశ్యం చూసి సంతృప్తితో మందహాసం చేసి, ఛాతీ విరుచుకుని, ఎర్రటోపీ సర్దుకుని తిరిగి లోపలికి వెళ్ళిపోయాడు పోలీసు.

# 3

నగరం అంతా ఆందోళనతో అట్టుడికినట్టు ఉడికిపోతోంది. అందులో ప్రముఖ పాత్ర వహించింది విద్యార్థులు. విచిత్రమైనదీ, విషాదకరమైనట్టిదీ అయిన విషయమేమిటంటే, ఈ ఆందోళన సమయంలో, చిన్నక్లాసులు చదివే చిట్టి చిట్టి పిల్లలు నిర్వహించిన పాత్ర. వాళ్ళు చూడబోతే పాలబుగ్గల పసివాళ్ళు. వాళ్ళు గుంపులు గుంపులుగా చేరడం, రాళ్ళు ప్రోగుచేయడం - "బంద్ కరో'' అంటూ అరుచుకుంటూ కనిపించిన ప్రతి ఎలక్ట్రిక్ బల్బుని పగలగొట్టడం, గురిచూసి పగలగొట్టినవాడిని హీరోగా భావించడం, పగలగొట్టలేని వాళ్ళు బాధపడడం, కనిపించిన కిటికీల మీద, బస్సుల మీద రాళ్ళు వేయడం, ఎవరికి తగిలేదీ తప్పేదీ తెలియకుండా రాళ్ళు రువ్వటం, ఇదంతా ఆందోళనలో పసిపిల్లలు నిర్వహించిన పాత్రలో ఒక భాగం. తీరా పోలీసులు వాళ్ళని తరుముకుని వస్తే, సందుల్లోకి, గొందుల్లోకి, సీమకుందేళ్ళలాగ పారిపోవడం. పోలీసులు వెళ్ళిపోగానే నవ్వుకుంటూ మళ్ళీ బయటకొచ్చి అల్లరి చేయడం, ఎవర్నయినా పోలీసు పట్టుకుంటే, గోలపెట్టి ఏడవడం - ఇదంతా దైనిక చర్యలో ఒక భాగం. పాపం ... పోలీసులకి, ముద్దుల మూటకట్టే ఆ అమాయక పిల్లలను ఏమీ చేయడానికి మనస్సు ఒప్పేదికాదు. వాళ్ళ అల్లరి చూసి ప్రాణం విసిగి ఎప్పుడైనా, వాళ్ళని భయపెట్టడానికి పట్టుకుంటే, వాళ్ళు భయంతో వణికిపోతూ గోల గోలగా ఏడ్చేసేవాళ్ళు. అదిచూసి రాతిబండగా భావించబడే పోలీసుల గుండెలు కూడా వెన్నలా కరిగిపోయి, వాళ్ళని కేకలేసి వదిలేసేవారు. వదిలేసిన తర్వాత, వాళ్ళు వెళ్ళినట్టే వెళ్ళిపోయి, తిరిగి అల్లరిమూకల్లో చేరిపోయేవారు. ఈ ఆందోళన దినాల్లో, ఏ నాయకులూ, పెద్దలూ కూడా కల్పించనంతటి తలనొప్పిని పోలీసులకు కల్పించారు ఈ పసివాళ్ళు. వాళ్ళని ఎట్లా సంబాళించాలా అనేది పెద్ద సమస్య అయిపోయింది పోలీసువాళ్ళకి.

# 4

హెడ్మాస్టరు గారి కోరిక మీద, స్కూల్‌దగ్గర రోజూ ఒక ముసలి పోలీసును కాపలా ఉంచారు పోలీసు శాఖవారు. కిటికీ తలుపులు, బయట తలుపులూ అన్ని మూసేసి, పిల్లలకి చదువు చెప్పడం ప్రారంభించారు హెడ్మాస్టరూ, టీచర్లూను.

పోలీసుశాఖవారు ఈ స్కూలు దగ్గర కాపలా పట్టింది ఒక్క పోలీసునే అయినా, అది కావలసిన ఫలితాన్నిచ్చింది. అక్కడ ఉన్నది ఒక్కడే పోలీసైనా అతడు వయస్సు మీరినవాడైనా, చేతిలో తుపాకీ అయినా లేకుండా ఒక్క లాఠీ మాత్రమే ఉన్నా, కాకి యూనిఫారంలో, ఎర్రటోపీ చేతిలో లాఠీ వున్న ఆ పోలీసును చూసేసరికి అంతవరకు స్కూలుమీద రాళ్ళు వేయాలని వచ్చిన పిల్లలు భయపడి పారిపోసాగారు.

కాపలా రోజూ ఉంటూండేసరికి అల్లరి పిల్లలు ఇంక అటురావడం మానుకున్నారు. అటువచ్చినా దూరంనుంచే "బంద్‌కరో'' అంటూ కేకలు వేసి వెళ్ళిపోయేవారు కాని, నిలబడి రాళ్ళు కొట్టడం మానేశారు.

# 5

రోజూలేంది - ఆరోజు తమ స్కూలు మెట్లదగ్గర కుర్చీమీద కూర్చుని వున్న పోలీసుని చూసేసరికి, ఆ స్కూలు పిల్లలకు ముందు భయంవేసి, చప్పుడు చేయకుండా, మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయారు. ఎప్పుడైతే ఆ పోలీసు తమ స్కూలుకి కాపలా వుండడానికి వచ్చాడని తెలిసిందో, అప్పుడే అతనంటే భయం పోయింది. వాళ్ళకి ఆ పోలీసు తమ మనిషిగా అనిపించాడు. ఎప్పుడైతే

ఆ పోలీసుని చూడగానే రాళ్ళు వేస్తున్న పిల్లలందరూ భయపడిపోయారో, అప్పుడు వాళ్ళందరికి, ఆ పోలీసు సాక్షాత్తు దేవుడులాగా అనిపించాడు. దానితో వాళ్ళందరికీ అతనంటే ఎనలేని గౌరవభావం, భక్తి కలిగి వాళ్ళలో వాళ్ళు - ఆ పోలీసును చూసుకుంటూ మురిసిపోతూ, మనసులోనే ఆరాధించడం మొదలుపెట్టారు. వాళ్ళ దృష్టి అంతా అతనిమీదే, వాళ్ళ మాటలన్నీ అతని ధైర్యసాహసాలను గురించే.

## 6

ఆ మర్నాడు పిల్లలంతా మామూలుగా స్కూల్‌కు వస్తున్నారు. ఆ పోలీసు, స్కూల్ మెట్ల దగ్గర కుర్చీమీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. పిల్లలకి అతనంటే భయం పోయినందుకు ధైర్యంగా అతని ముందునుంచి వెళ్ళారు. అయితే అతను జోగుతూండడం వల్ల, అతని ప్రక్కనుంచి వెళ్ళేటప్పుడు మాత్రం అల్లరి చేయకుండా వెళ్లారు.

సుశీల మామూలుగా బడికి వచ్చింది. గడిచిన రోజున ఆ పోలీసుని చూడగానే, అల్లరి పిల్లలు పారిపోయిన దగ్గర్నుంచీ, ఆ పసిపాప, అతనిని రక్షకుడుగా భావించుకోసాగింది. అతనంటే ఎనలేని భక్తి ఏర్పడింది. బడి మెట్లదగ్గరికి రాగానే పోలీసుని చూసింది. అతన్ని చూడగానే ఆ పాప కళ్లు ఆనందంతో మెరిశాయి.

"నమస్తే పోలీసూ!" అంటూ చేతులు జోడించింది.

కునికిపాట్లు పడుతున్న ఆ పోలీసు కంగారుగా కళ్ళు తెరచి "నమస్తే" అన్నాడు.

ఎదురుగా ముద్దులు మూటకట్తున్న ఆ పాపని చూసి అతను మురిసిపోయాడు.

ఆపేక్షగా "ఇదరావో బేటీ" అన్నాడు పోలీసు.

సుశీల దగ్గరకు వచ్చింది.

ఆ పాప నడుం చుట్టూ ఆప్యాయంగా చేతులు వేసి "క్యా నామ్ హై తుమ్హారా?" అని అడిగాడు.

"సుశీల" అంది ఆపాప సిగ్గుపడుతూ.

"అచ్చా ..... బహుత్ అచ్ఛాహై ...." అంటూ ఆ పాప బుగ్గల మీద ముద్దుపెట్టుకున్నాడు.

సుశీల సిగ్గుపడుతూ పోలీసు పట్టు విడిపించుకొని లోపలికి వెళ్ళిపోతుంటే "ప్యారే మున్ని' ' అనుకున్నాడు పోలీసు.

## 7

ఇంటికి వెళ్ళాక సుశీల "అమ్మా ..... అమ్మా...." అంటూ ఆనందంగా అరుచుకుంటూ వెళ్ళింది.

"ఏమిటే ఆ సంతోషం" అంటూ అడిగింది అమ్మ.

"ఇవాళ పోలీసు నాకు నమస్తే చెప్పాడమ్మా" అంది కళ్ళు తిప్పుకుంటూ సుశీల.

"నీ కెందుకు చెప్పాడే!" అంది వాళ్ళమ్మ నవ్వుతూ.

"నేను ముందు చెప్పానమ్మా" అంది సుశీల.

"అరే .... పోలీసును చూస్తే నీకు భయం వేయలేదూ?" అంది ఆశ్చర్యంగా అమ్మ.

"భయమెందుకమ్మా! పోలీసు చాలా మంచివాడు. మా అందరికి కాపలా కాస్తున్నాడు. ఆయన్ని చూస్తేనే రౌడీపిల్లలు పారిపోయారు తెలుసా!" అంది సుశీల అభినయంతో.

"అల్లాగుటే" అంది అమ్మ.

"పోలీసు చాలా మంచివాడమ్మా. నన్ను ముద్దుకూడా పెట్టుకున్నాడు" అంది సుశీల.

"సర్లే బట్టలు మార్చుకుని కాళ్ళూ, చేతులు, ముఖం కడుక్కుని లోపలికిపో" అంది అమ్మ. సుశీల లోపలికి వెళ్ళిపోయింది.

# 8

ఆరోజునుంచి ప్రతిరోజూ బడిలోకి వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడూ సుశీల ఆ పోలీసుకి "నమస్తే" చెప్పడం, సుశీలకు కూడా ఆ పోలీసు "నమస్తే" చెప్పి ముద్దు చేయడం పరిపాటి అయిపోయింది. సుశీలని చూసి ఇంకా చాలామంది పిల్లలు కూడా "నమస్తే పోలీసూ" అంటూ దగ్గరకు రావడం ప్రారంభించారు. పోలీసు వాళ్ళతోకూడా ముద్దు ముచ్చటలు చేసేవాడు కాని అతనికీ సుశీలకి మధ్య ఏర్పడిన అనుబంధం మాత్రం అనుపమానమైనది. అది, ఇది అని అభివ్యక్తము చేయలేనట్టిది.

# 9

వారం రోజులు గడిచాయి. రోజురోజుకీ నగరంలో ఆందోళన అంతకంతకీ ఉధృతం అవడంతో స్కూల్‌ని నిరవదికంగా మూసివేశారు.

ఆరోజున ఆందోళన మరీ వికృతరూపం దాల్చడంతో నగరంలో కర్ఫ్యూ విధించబడింది. రోడ్లన్నీ నిర్మానుష్యంగానే ఉన్నాయి. పోలీసులు గుర్రాల మీద గస్తీ తిరుగుతున్నారు. పోలీసు వ్యానులు కూడా, జనాన్ని బయటికి రావద్దని హెచ్చరిస్తూ రోడ్ల వెంబడి తిరుగుతున్నాయి. బ్యాచీలు బ్యాచీలుగా రిజర్వు పోలీసులు టక టకా బూట్లు చప్పుడు చేసుకుంటూ నడుస్తున్నారు. ఎవరైనా రోడ్డుమీదకు వస్తున్నట్లు కనిపిస్తే, వాళ్ళని గట్టిగా కేకలువేసి అదిలిస్తున్నారు. పోలీసులకి సహాయం చేయడానికి ఆందోళనకారుల్లో భీతిని కల్పించడానికి మిలటరీని కూడా రప్పించడం జరిగింది. సైన్యం మిలటరీ ట్రక్కులలో బారులుగా నిలబడి, అన్నివైపులా తుపాకులను గురిచూసి పట్టుకొని నిల్చుని ఉంది.

సుశీల కిటికీలోనుంచి ఈ దృశ్యాల నన్నిటిని చూస్తోంది. ఆ పసిపాపకి బయటవున్న పరిస్థితి యొక్క తీవ్రత ఏమిటో తెలియదు. పోలీసులు వస్తుండడం, పోతుండడం, ఏవేవో అరుస్తుండడం, వ్యానులూ, ట్రక్కులూ వస్తూండడం, వాటిల్లో ఉన్న మనుష్యులు వింత వింత దుస్తులు ధరించి, చేతుల్లో ఏమిటేమిటో ఆయుధాలు పుచ్చుకొని తిరుగుతుండడం - అంతా వింతగా ఉంది. ఆ దృశ్యాలు ఎంతసేపు చూసినా తనివితీరడం లేదు ఆ పాపకు. వాళ్ళమ్మ అన్నానికి పిలిచినా వినిపించుకోకుండా, అట్టే చూస్తుండిపోయింది.

ఎన్నిసార్లు పిలిచినా సుశీల రాకపోయేసరికి, వాళ్ళమ్మే అక్కడికి వచ్చింది. "ఏమి చేస్తున్నావే!" అంటూ.

అమ్మ కేకతో సుశీల ఈలోకంలోకి వచ్చింది. "అమ్మా" చూడవే ఎంతమంది పోలీసులు వెళ్తున్నారో!" అంది గ్రుడ్లు పెద్దవి చేసి.

"నీకెందుకు .... లోపలికిరా" అంటూ గద్దించింది అమ్మ.

"ఎందుకే అమ్మా కొట్లన్నీ కట్టేసి ఉన్నాయి? రోడ్డు మీద ఎవరూ తిరగడం లేదు?" అని అడిగింది సుశీల.

"ఇవాళ కర్ఫ్యూ విధించారు" అంది అమ్మ.

"అంటే?" అని అమాయకంగా అడిగింది సుశీల.

"అంటే ఎవ్వరూ రోడ్డుమీదికి వెళ్ళకూడదన్నమాట. అంతా ఇళ్ళల్లోనే ఉండాలి" అంది వాళ్ళమ్మ.

"వెళ్తే ఏమవుతుంది?" అని మళ్ళీ ప్రశ్నించింది సుశీల,

"వాళ్ళ చేతులలో ఉన్న తుపాకులతో కాల్చి చంపుతారు" అంది అమ్మ విసుగ్గా.

"కాలిస్తే నిజంగా చచ్చిపోతారామ్మా?" అని మళ్ళీ అమాయకంగా ప్రశ్నించింది సుశీల.

"వెధవ సందేహాలూ నీవూను. తుపాకీతో కాలిస్తే చావకుండా ఎల్లా ఉంటారు? నుంచున్న వాళ్ళు నుంచున్నట్లే క్రిందపడి చచ్చిపోతారు" అంది చిరాకుగా వాళ్ళమ్మ.

"మరి రోడ్డుమీద పోలీసులు తిరుగుతున్నారుగా, వాళ్ళని కాల్చరా" అని అడిగింది సుశీల.

"నెత్తిమీద టోపీ, ఒంటిమీద కాకీ బట్టలు, చేతుల్లో తుపాకులు ఉంటే వాళ్ళు పోలీసులన్న మాట. వాళ్ళని కాల్చరు. అది లేకుండా ఉన్నవారు ఎవరైనా బయటకు వస్తే కాల్చేస్తారు. అయినా నీకు ఇవన్నీ ఎందుకే?" అని కేకలేసింది అమ్మ.

సుశీలకు కన్నీళ్ల తిరిగాయి.

"అసలు ఎందుకమ్మా మనుష్యులను కాల్చి చంపడం?" అని అడిగింది సుశీల గద్గద కంఠంతో.

"నీకు నేను సమాధానం చెప్పలేను తల్లీ. నాన్నగారు లోపల నిద్రపోతున్నారు. లేచాక ఆయన్ని అడుగు. ముందు అన్నానికిరా" అంటూ బలవంతాన లోపలికి తీసుకువెళ్ళింది అమ్మ.

# 10

సుశీల అన్నం తినివచ్చి మళ్ళీ కిటికీలో కూర్చుంది. ఆ. పసిహృదయం అనేక ఆలోచనలతో తల్లడిల్లి పోతోంది "పోలీసు వేషంలోలేని వాళ్ళెవరైనా వస్తే కాల్చిచంపుతారట! ఎవరు రాకుండా ఉంటే బాగుండు దేవుడా" అని అనుకుంటూంది మనస్సులోనే.

కిటికీలోంచి చూస్తున్న సుశీలకు పైనుండి వస్తున్న పోలీసు కన్పించాడు. అతని ప్రక్కన మరి ముగ్గురు మనుష్యులు ఉన్నారు. ఎవ్వరికీ నెత్తిమీద టోపీలు లేవు ఒంటిమీద కాకీ బట్టలు లేవు. చేతుల్లో తుపాకులు లేవు. నలుగురూ మఫ్టీలో ఉండి మాట్లాడుకుంటూ వస్తున్నారు. పోలీసు రూపంలో లేని వాళ్ళని చూసేసరికి, సుశీల గుండెలు అవిసిపోయాయి. "అమ్మో ... వీళ్ళు పోలీసుల వేషంలో లేరే, తుపాకులున్న పోలీసులు వీళ్ళని చూస్తే యింకేమైనా ఉందా? వీళ్ళని కాల్చి చంపేయరూ. అయితే ఈ పోలీసులు చచ్చిపోతారేమో!" భయంతో వణికిపోయింది. సుశీల "పోలీసూ లోపలికిరా' ' అంటూ గట్టిగా అరచింది.

సుశీల అరుపు దొడ్లో పని చేసుకుంటున్న అమ్మకి కాని, దూరాన్నుంచి మాట్లాడుకుంటూ వస్తున్న పోలీసులకు కాని వినిపించలేదు.

సుశీల గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. కిటికీలోంచి ఛంగున క్రిందికి దూకింది. వీధి తలుపు తీసి బయటకు వెళ్ళి, అరుగుమీద నుంచుని "పోలీసూ....లోపలికిరా" అని అరచింది.

పోలీసు సుశీల ఇంటివేపే వస్తున్నాడు. కాని తన మాటల్లో సుశీలని గమనించలేదు. ఆ పిల్ల పిలుపు అతనికి వినిపించలేదు.

నేల దద్దరిల్లే శబ్దంతో ఎదుటివైపు నుంచి మిలిటరీ ట్రక్కు వేగంగా వచ్చేస్తోంది. దానిలో తుపాకులు ఎక్కుపెట్టి ఉన్న మిలిటరీ వాళ్ళని చూసేసరికి ఆ పసిప్రాణం తల్లడిల్లి పోయింది.

"పోలీసు పోలీసు వేషంలో లేకుండా వచ్చేస్తున్నాడు. ఎదురుగా తుపాకులతో పోలీసులు వచ్చేస్తున్నారు. ఇంకేముంది - వాళ్ళు తన పోలీసును చూస్తే కాల్చేస్తారు. తన కేక పోలీసు వినిపించుకోడం లేదు. ఏం చేయాలో! "ఊపిరింతా బిగపెట్టి గట్టిగా "పోలీసూ .... లోపలికిరా..... వాళ్లు కాల్చేస్తారు" అంటూ అరుస్తూ, అరుగుమీదనుంచి క్రిందకు దూకి రోడ్డుమీద పరుగెత్తడం మొదలుపెట్టింది. పోలీసు వైపు సుశీల.

అప్పటికి పోలీసు సుశీల ఇంటికి చాలా సమీపంగా వచ్చేశాడు. సుశీల కేక వినిపించింది. ఆ పాప తనవంకే పరుగెత్తుకు వస్తోంది. వెనకాలే, వేగంగా, మృత్యురథమల్లే, మిలటరీట్రక్ వస్తోంది. అతని పై ప్రాణాలు పైనే పోయాయి ఆ దృశ్యం చూసేసరికి.

"మున్నీ .... అందర్ జావో" అంటూ గట్టిగా అరచి సుశీల వైపు పరుగెత్తాడు పోలీసు.

"కీచు" మంటూ మిలిటరీ ట్రక్కు ఆగింది. కాని కాలం మించిపోయింది.

సుశీల నెత్తురు మడుగులో తేలుతోంది.

"మున్నీ" అంటూ ఏడుస్తూ ఆ పిల్లను చేతుల్లోకి తీసుకున్నాడు పోలీసు.

అతి కష్టం మీద కళ్ళు తెరచి చూసింది. సుశీల పోలీసుని చూడగానే ఆ పాప ముఖం వికసించింది.

"నిన్నెవరూ కాల్చలేదుగా పోలీసు!" అంది భారంగా.

ఏమీ మాట్లాడలేక తల ఆడించాడు పోలీసు.

"పోలీసూ ... లోపలికి రా ... లేకుంటే వాళ్ళు కాల్చే......" అంటూ మాట పూర్తి కాకుండానే అతని ఒళ్ళో ఒదిగిపోయింది సుశీల.

*(ప్రగతి వీక్లీ, 25-5-1973)*